క్లుప్తంగా

మీడియాపై ఆంక్షలు తొలగించాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియాపై ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్న విషయం తెలుసుకొని ఆసుపత్రికి వెళ్లిన మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించడం లేదని, సూచిక బోర్డులపై మీడియాకు అనుమతులు లేవని నోటీసులు అంటించారన్నారు. దీనిపై విచారణ జరిపించి విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడప సతీష్, సురేష్, బాల శ్రీనివాస్, శ్రీధర్, రాజ్‌కుమార్, రవి, రావుల శంకర్, ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) ఎస్సైగా సురేశ్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల నూతన ఎస్సైగా సోమవారం సీహెచ్ సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సిర్పూర్(టి) ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన కమలాకర్ వీఆర్ రామగుండంకు బదిలీపై వెళ్లగా.. సీహెచ్ సురేశ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు.

ఎస్సైకి సన్మానం

రెబ్బెన: రెండు రోజుల క్రితం రెబ్బెన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వెంకటకృష్ణను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్ బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు వేర్వేరుగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు, శాంతిభద్రతల స్థాపనకు అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దుర్గం రాజేశ్, గోగర్ల రాజేశ్, చిరంజీవిగౌడ్, మండల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే



సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎం శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు వల్లపు కిరణ్, శశిధర్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాంపల్లి శంకర్, కోశాధికారి పుల్లూరి శంకర్, ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, రావుల వినాయక్, కోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న చిరంజీవి

ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి అన్నారు. సోమవారం సిబ్బందితో కలిసి కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, శానిటేషన్ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, శారద, నగేశ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలకు నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా వర్షం కురువడంతో తడుచుకుంటూ ఇళ్లకు వెళ్లారు. వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతలైన సంజీవయ్య కాలనీ, కౌసర్‌నగర్, ద్వారకానగర్ కాలనీల్లోకి వరద నీరు చేరింది. ఈదురు గాలులతో వర్షం కురువడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కాగజ్‌నగర్ టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని జెడ్పీఎస్‌ఎస్ బాలుర పాఠశాలలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. భావి తరాలకు తరగని సంపద చెట్లని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమీళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సోమవారం ఏక్ పేడ్ మా కా నామ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంఈవో వేణుగోపాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ఏక్ పేడ్ మాకే నా కార్యక్రమంలో భాగంగా చేడ్వాయి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు తల్లులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించటానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, ఏపీవో సతీష్, పంచాయితీ కార్యదర్శి జయ, ఉపాధ్యాయులు రాకేశ్, సంతోష్, రాజ్ కమలాకర్ పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ

బెజ్జూర్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తల్లి పేరిట మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్, ఎంఈవో సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

నాటిన మొక్కలను సంరక్షించాలి

రెబ్బెన: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంలో విద్యార్థులు వారి తల్లులతో కలిసి పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లులతో కలిసి పాఠశాలల్లో నాటిన మొక్కల సంరక్షణను బా ధ్యతగా తీసుకోవాలన్నారు. గంగాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం లతీఫ్, పాఠశాల ఏఏపీసీ చై ర్మన్ భీంబాయి విద్యార్థులతో మొక్కలు నాటారు.

మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

కెరమెరి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్, తహసీల్దార్ సంతోష్ కుమార్, ఎస్సై మధుకర్ అన్నారు. సోమవారం మెగా ప్లాంటేషన్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్కను పరిరక్షించాలన్నారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా మొక్క నాటి తమ తల్లికి అంకితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఆర్‌ఐ పవన్, కార్యదర్శి గణేశ్, హెచ్‌ఎంలు భాస్కర్, బిజువా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏలు అరవింద్, మహేందర్, ధరంసింగ్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



మొక్క నాటుతున్న అధికారులు



గంగాపూర్‌లో మొక్క నాటుతున్న విద్యార్థులు

పింఛన్లు పెంచాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ధర్నా చేస్తున్న నాయకులు

కెరమెరి: ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.4 వేల నుంచి 6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2 వేల నుంచి 4 వేలకు పింఛన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుసుల్ల సాయికుమార్, పార్ల వెంకటేశ్, కిషన్, భీంరావు, పరమేశ్వర్, బానయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ హామీలను అమలు చేయాలి

కౌటాల: కాంగ్రెస్ ఎన్నికల ముంది ఇచ్చిన పింఛన్ హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నక్క పెద్ద శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షన్‌దారులు, నాయకులు ఆందోళన చేపట్టారు. దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు., పెన్షన్లు పెంచకుండా కాంగ్రెస్ కాలయాపన చేస్తుందన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇగురపు విఠల్, పిట్టల సత్యనారాయణ, రాజేశ్, హీరమాన్, మాణిక్, సిద్దయ్య, సుదర్శన్, పోశం పాల్గొన్నారు.

దహెగాం: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పింఛన్‌ను పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి థామస్ మాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పింఛ న్ పెంచడంతో పాటు కొత్తవారికి పింఛన్ మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ కా ర్యాలయంలో డీటీ గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెంచుతానన్న పింఛన్ ఇప్పటికీ పెంచలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, రాజయ్య, మహేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని నిరసన

కాగజ్‌నగర్ టౌన్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించాలని పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజమౌళి, ప్రిన్సిపాల్ నిరత్‌కర్, అధ్యాపకులు, పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

యూరియా పంపిణీని పరిశీలించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండలంలోని జంబుగ రైతువేదికలో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీని సోమవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అదనంగా 100 మెట్రిక్ టన్నుల యూరియాను నియోజకవర్గానికి అవసరం ఉందని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు తెలియజేయడంతో యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు గుళికల యూరియాతో పాటు నానో యూరియాను కూడా వాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, రాకేశ్, కార్తీక్, వంశీ, తిరుపతి, అంజి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సకాలంలో యూరియా అందిస్తాం

బెజ్జూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఏవో నాగరాజ్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా పంపిణీ కొనసాగుతూనే ఉంటుందన్నారు. ప్రతీ రైతుకు యూరియా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దళారీలను నమ్ముకొని రైతులు ఎవరూ మోసపోవద్దన్నారు. సోమవారం 600 మందికి 1200 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ యూరియా పంపిణీ ఇన్‌చార్జి నారాయణ, ఏఈవోలు మీనా, మారుతి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కాగజ్‌నగర్ టౌన్: జాతీయ హిందీ దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం హిందీని అధికారిక భాషగా గుర్తించిందన్నారు. దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందని, హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా దేశ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం, అధ్యాపకులు జనార్దన్, శారద, దత్తాత్రేయ మహేశ్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిందీ అధ్యాపకుడు

చట్టాలపై అవగాహన అవసరం

కౌటాల: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. సోమవారం షీంటీం ఆధ్వర్యంలో కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియా వినియోగం, సైబర్ క్రైం గురించి వివరించారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ బాలకిషన్, సభ్యులు రమాదేవి, స్వప్న, శ్రీనివాస్, అధ్యాపకులు రాంబాబు, ప్రకాశ్, రాందాస్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

ఆసిఫాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఇస్లాంబిన్ హసన్ సోమవారం తహసీల్దార్ రియాజ్ అలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో ప్రస్తుతం చెల్లిస్తున్న పింఛన్లు సరిపోవడం లేదన్నారు. దివ్యాంగులతో పాటుగా వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు చెల్లించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దారంతా గుంతలే

- కోతకు గురైన కల్వర్టులు, గుంతలు పడిన రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా.. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ప్రధాన రహదారులు గుంతలు పడడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులకు రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు సైతం చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిర్పూర్(టి)-కౌటాల ప్రధాన రహదారిపై వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని మద్దెల వాగు వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. సిర్పూర్(టి)-మాకిడి అంతర్రాష్ట్ర రహదారిపై స్థానిక గంగాయిగూడ కాలనీ వద్ద ఉన్న కల్వర్టు కోతకు గురికావడంతో పాటు ఇదే రహదారిలో ఉన్న హుడ్కిలి, మాకిడి గ్రామాల సమీపంలో రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా మండలంలోని చీలపల్లి-మాలిని రహదారి, సిర్పూర్(టి)-ఇటిక్యాల పహాడ్ రోడ్డు, భూపాలపట్నం-చింతకుంట ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి. తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజల ప్రాణాలు పోతున్నా.. అధికారులకు పట్టదా అని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు



కోతకు గురైన సిర్పూర్(టి)-కౌటాల రహదారి

ప్రమాదాలు జరుగుతున్నాయి



భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల కోతకు గురికావడంతో ఇరువైపులా వాహనాలు వచ్చినప్పుడు, రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్లు, గుంతలకు మరమ్మతులు చేపట్టాలి.

– లక్ష్మణ్

అధికారులు స్పందించాలి



మండలంలోని ప్రధాన రహదారులు భారీ వర్షాలకు కోతకు గురవుతున్నాయి. గుంతలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

– సంజీవ్

బొజ్జిరావు యూత్ కమిటీ ఎన్నిక

తిర్యాణి: మండలంలోని గుండాలలో సోమవారం సోయం బొజ్జిరావు యూత్ కమిటీని ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా మర్సుకోల అశోక్, అధ్యక్షుడిగా ఆడ సోము, ప్రధాన కార్యదర్శిగా ఆడ అశోక్, ఉపాధ్యక్షుడిగా మర్సుకోల కాంతారావు, సహాయ కార్యదర్శులుగా తొడసం లచ్చు, కోట్నాక భీంరావు, కోశాధికారిగా శేఖర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం సాయంత్రం ఏకదాటిగా వర్షం కురువడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడంతో కనీసం నిలబడేందుకు వీలులేకుండా బస్టాండ్ ఆవరణలో పండ్లు, దుకాణాలును ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడ్డారు. సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు మండిపడ్డారు. ఆదాయం తప్పా సౌకర్యాలపై ధ్యాస లేదన్నారు.



బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పండ్ల దుకాణం

మున్సిపల్ కార్మికులు ఆందోళన చెందొద్దు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు వేతనాలు అందడం లేదని ఆందోళన చెందవద్దని ఎమ్మెల్సీ దండె విఠల్ సోమవారం ప్రకటనలో అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలను తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. పెండింగులో వేతనాలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పారిశుద్ధ్య కార్మికులు విధుల్లోకి చేరాలని కోరారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సోమవారం నిర్వహించిన ఐదోవిడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదా గా ముగిసింది. డీఆర్‌డీవో దత్తారాం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రూ.5,02712 రికవరీ చేసినట్లు ఎస్‌ఆర్‌సీపీ రవి తెలిపారు.

విశ్వకర్మ భగవానుని విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ భగవానుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం పురుషోత్తం చారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు సాగుతాయన్నారు. విశ్వకర్మ భగవానుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సభ్యులు, పురోహితులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఎస్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు నుంచి కెరమెరి, జైనూర్ వరకు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. కాగజ్‌నగర్ మండలం బలగాల రెసిడెన్షియల్ పాఠశాల(బాలుర)కు వెళ్లేదారి వర్షాలకు పూర్తిగా దెబ్బతిందని, గుండి రహదారిని బాగు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.